# నిర్దుష్టమైన సంకల్పమే మంచి ఫలితములను ఇవ్వగలదు

రచన : డాక్టర్ కోట నిత్యానంద శాస్త్రి
(23-34-18, సెకండ్ ఫ్లోర్, మానేపల్లి వారి వీధి, లక్ష్మినగర్, విజయవాడ-11)

★

మనదేశంలో చాతుర్వర్ణ్యముల వారు ఏ శుభాశుభకార్యాన్నైనా సంకల్పం చెప్పనిదే లేక చెప్పించుకొననిదే ప్రారంభించరు. మన దేశము నందు ద్విజులు ప్రతి దినము త్రికాలములయందు వారాచరించు సంధ్యావందనమును నందు దీనిని చెప్పుకొన్న మీదటనే సంధ్యావందనాన్ని ప్రారంభిస్తారు. దీనినే నిత్యసంకల్పముగా వ్యవహరిస్తున్నాము.

ఆ సేతు హిమాచలపర్యంతం, అన్ని ప్రాంతాలవారు నిత్యసంకల్పంను "శ్రీ మహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యః(బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే అష్టావింశన్మహాయుగే (అష్టావింశతితమే) కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే..." ఇత్యాదిగా చెప్పుచుండగా ఒక్క మన ఆంధ్రప్రదేశ మందు మాత్రం దాదాపు అందరూ పై దానిలోని 'అష్టావింశన్మహాయుగే' అను పదము లేకుండగనే సంకల్పము చెప్పుచున్నారు. ఈ పదలోపము బహుదీర్ఘకాలంగా అనగా 100 లేక 150 సం॥ల నుండి కొనసాగివస్తున్నదని నా పరిశోధనలో వెల్లడయింది. ఇందువల్ల కాలగణనలో 27 (ఇరువది ఏడు) మహాయుగాల కాలం తగ్గిపోయింది. '...వైవస్వత మన్వంతరే అష్టావింశన్మహాయుగే కలియుగే...' అంటే వైవస్వత మన్వంతరే 28వ మహాయుగంలోని కలియుగమౌతుంది. కాని "...వైవస్వత మన్వంతరే కలియుగే.." అని సంకల్పము చెప్పుచున్నందున అది వైవస్వత మన్వంతరములోని ప్రథమ మహాయుగంలోని కలియుగమవుతుంది. ఇందువల్ల కాలగణనలో 27 (ఇరువది ఏడు) మహాయుగాల కాలం తగ్గిపోయింది.

ఒక మహాయుగం అనగా కృతయుగం 17,28,000 + త్రేతాయుగం 12,96,000 + ద్వాపరయుగం 8,64,000 + కలియుగం 4,32,000 వెరశి 43,20,000 సంవత్సరములు. అట్టివి 27 మహాయుగాలు అనగా 27 X 43,20,000 = 11,66,40,000 సంవత్సరములవుతాయి. అవి సృష్ట్యాదిగా నేటి వరకు అయిన ఈ సృష్టికాలంలో తగ్గిపోయాయి.

పై సంకల్ప ప్రకారం అష్టావింశన్మహాయుగే పద సహితంగా నేటికి 197,29,49,108 సం॥లు అవుతాయి (పంచాంగములలో చూడవచ్చును).

మరల మనవారు "మహాసంకల్పమును" మాత్రం అష్టావింశన్మహాయుగే (అష్టావింశతితమే) పదసహితముగా సరిగ్గానే చెబుతున్నారు. ఈ మహాసంకల్పము ప్రతిరోజు చెప్పునదికాదు. అది సంవత్సరములో అప్పుడప్పుడు పరిమిత సంఖ్యగల రోజులలో అనగా మహాదానవములు, యజ్ఞయాగాదులు, ప్రాయశ్చిత్త కర్మలు, కన్యాదానవములు, మహావ్రతములు, మహానదీ స్నానాదుల నాచరించునప్పుడు మాత్రమే చెప్పబడుతుంది. అందు ఆనాడాచరించిన నిత్యసంకల్పమునందలి కాలగణనమే వివరముతో విపులంగా చెప్పబడుతుంది. నేడు మన వారు అష్టావింశన్మహాయుగే(అష్టావింశతితమే) పదసహితముగా మహాసంకల్పము చెబుతున్నారంటే అది అంతకు ముందు నిత్యసంకల్పమున చెప్పబడివుండాలి. నిత్యసంకల్పమున చెప్పబడనిదేదీ మహాసంకల్పమున ఉండదు. నిత్యసంకల్పమున ననుసరించి రోజువారీ కాలగణన లేనిదే మహా సంకల్పమున కాలగణన చేయలేము.

"సూర్యసిద్ధాంతం" ఖగోళ, జ్యోతిశ్శాస్త్రజ్ఞులకు, సిద్ధాంతులకు, పంచాగకర్తలకు, పండితులకు అందరికి పరమప్రమాణమైనది. అన్ని రకాల గణితములను దీనిననుసరించే చేస్తుంటారు. అట్టి సూర్యసిద్ధాంతములో 1వ అధ్యాయం, మధ్యమాధికారంలో 21, 22, 23 శ్లోకాలలో బ్రహ్మవయోగణనను ఈ విధంగా చెప్పియున్నాడు.

శ్లో॥ పరమాయుః శతం తస్య తయాఽహోరాత్ర సంఖ్యయా ॥
అయుషోఽర్ధమితం తస్యశేషకల్పోఽయమాదిమః ॥ (21)

శ్లో॥ కల్పాదస్మాచ్చ మనవః షడ్వ్యతీతాః ససన్ధయః ।
వైవస్వతస్య చ మనోర్యుగానాం త్రిఘనోగతః ॥ (22)

శ్లో॥ అష్టా వింశద్యుగాదస్మాద్యాతమేతత్కృతం యుగమ్ ।
అతః కాలం ప్రసంఖ్యాయ సంఖ్యామేకత్ర పిణ్డయేత్ ॥ (23)

అనగా "పూర్వం చెప్పబడిన అహోరాత్ర ప్రమాణముచే నూరుసంవత్సరములు బ్రహ్మకు పరమాయుర్దాయము. అందు సగమాయుర్దాయము గతించింది. రెండవ

సగంలో మొదటి రోజు జరుగుతోంది. ఈ కల్పాదిగా ఆదిసంధితో సహా ఏడు మనుసంధులు, ఆరుగురు మనువులు, జరుగుతున్న ఈ ఏడవ వైవస్వత మన్వంతరంలో 27 మహాయుగాలు గతించాయి. 28వ మహాయుగంలో కృతయుగం గతించింది. ఈ కృతయుగానంతరం ఎంత గతించిందో దానిని, వర్తమాన కలియుగంలో జరుగుతున్న కాలమును, మన్వాదులలో గతించిన కాలము కలుపుకొని లెక్కించుకొనమని చెప్పి మనకు బ్రహ్మవయోగణనను (సృష్టికాలగణన) అందించియున్నాడు''.

దాని ప్రకారం వివరించుకొని లెక్కించుకుంటే ఈ 28వ మహాయుగ కృతయుగాంతానికి 197,07,84,000 సౌ।।సం।।లు అవుతుంది. దానికి వర్తమానంలో గతించిన త్రేతాయుగం 12,96,000 ; ద్వాపరయుగం 8,64,000; ప్రస్తుత కలియుగంలో నేటి "వ్యయ" సంవత్సరమునకు అయిన 5108 సం।।లు కలుపుకుంటే నేటికి ఈ కల్పాదిగా జరిగిన సృష్టికాలం 197,29,49,108 సం।।లు అవుతుంది. ఇది పై సంకల్పమునకు ప్రతిరూపమేగాని మరొకటి కాదు. కనుక సూర్యసిద్ధాంత కాలగణననుసరించి మన సంకల్పమున లుప్తమైన అష్టావింశన్మహాయుగే అను పదమును పునరుద్ధరించి మన నిత్యసంకల్పమును నిర్దుష్టపరచుకోవలసిన ఆవశ్యకత ఎంతయున ఉంది. కాలగణనలో ఇంతటి ప్రాధాన్యత గల సంకల్పమును పదలోపముతో దాదాపు అందరు మన రాష్ట్రంలో ఆచరిస్తున్నారు. అట్టి వారే నేడు మన రాష్ట్రవ్యాప్తంగా గల తిరుమల తిరుపతి దేవస్థానములు, ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖల పరిధిలో గల వేలాది దేవాలయాల్లోను, ఆ పరిధిలో లేని దేవాలయాల్లోనూ అర్చకులుగాను, పూజారులుగాను వేదాధ్యయనపరులుగాను, గురుకుల వేద పాఠశాలల అధ్యాపకులు మొదలుగాను ఉంటున్నారు. అందువల్ల ఆయా దైవాలకు ఆచరించే ప్రతి సేవా కార్యక్రమంలోను ఆదిలోనే సంకల్ప పరంగా అపచారం జరుగుతోంది. కనుక సంకల్పమున లేక బ్రహ్మమానమున లుప్తమైన అష్టావింశన్మహాయుగే పదముతో పునరుద్ధరించి పూర్తి పాఠమును ఇస్తూ సంధ్యావందన, వ్రతకల్పాది పుస్తకములు ప్రచురించి తగువారలకు అందించి ప్రచారమొనరించవలసిన బాధ్యత విప్రసంఘాలపైన, స్మార్త, శైవ, వైష్ణవ పీఠములపైన, ధర్మ ప్రచార సంస్థలపైన మరియు ఆయా సందర్భాలలో వ్రతకల్పాదులను ప్రచురించి వారి వారి పాఠకులకు అందించే దిన పత్రికల వారిపైన ఎంతయున ఉంది.

ప్రస్తుతం మనవారు నిత్య సంకల్పమును ...అష్టావింశన్మహాయుగే పదలోపంతోనూ, మహా సంకల్పమును అష్టావింశన్మహాయుగే పదసహితంగాను ఆచరిస్తున్నందున ఈ సృష్టికర్తయైన ఆ బ్రహ్మదేవునికి రెండు రకాల వయస్సు వస్తుంది. అనగా నిత్యసంకల్ప పరంగా 185,63,09,108; మహా సంకల్పపరంగా 197,29,49,108 సంవత్సరాలు నేటి వస్తున్నాయి. ఒకే వ్యక్తి రెండు రకాల వయస్సు ఉండటం అసంభవము.

ముఖ్యంగా అన్ని హంగులు కలిగి భారతీయ సంస్కృతికి, వేద పరిరక్షణకు విశ్వవ్యాప్తంగా విశేష కృషి చేస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం వారిపైన, మన ప్రభుత్వ దేవాదాయ ధర్మదాయ శాఖ వారిపైన ఎంతయిన ఉందని మనవి చేస్తున్నాను.

ఈ విషయంలో బహుకాలంగా నే చేస్తున్న కృషికి స్పందించి ఆంధ్రభూమి తెలుగు దిన పత్రిక వారు ఈ వ్యయ సంవత్సర వినాయకచవితి సందర్భముగా (ది.26-08-2006) పాఠకులకు అందించిన వినాయక వ్రతకల్పము అను ప్రత్యేక సంచికయందు సంకల్పమును అష్టావింశన్మహాయుగే సహితంగా పూర్తి పాఠమును ఇచ్చి ప్రచురించియున్నారు. వారికి నా అభినందనలు.

★★★